మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట




ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

# ఇందిరమ్మ నమూనా ఇంటి పనులకు శంకుస్థాపన

**పేదల జీవితాల్లో వెలుగు నింపేందుకే ఇందిరమ్మ ఇల్లు**

**నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి**

**ధన్వాడ, జనవరి 20 ప్రభాతవార్త :** మరికల్ మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇల్లు నమూనా ఇంటి నిర్మాణానికి సోమవారం రోజున ఎమ్మెల్యే పర్ణికరెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 6 గ్యారంటీల పథకాల్లో ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా ఐదు లక్షల రూపాయల స్కీన్‌తో పక్కా ఇండ్లు నిర్మించాలని ఇందిరమ్మ రాజ్యంలో పేదవారి జీవితంలో వెలుగులు నింపేందుకు ప్రతి నియోజకవర్గంలో 3500 ఇండ్లు ప్రతి సంవత్సరానికి లబ్ధిదారులకు చేకూర్చాలని ఈ కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని గ్రామాల్లో గ్రామసభ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసిందని నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణపేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ సదాశివరెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకులు సూర్య మోహన్ రెడ్డి, మండల అధ్యక్షుడు బెలగొండి ఈరన్న, పట్టణ అధ్యక్షుడు హరీష్ కుమార్, పోలేమోని ఆంజనేయులు, పోలమోని రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్యాలయానికి తాళం

- రెగ్యులర్ కమిషనర్‌ను నియమించాలని డిమాండ్
- పనులు జరగడంలేదని కార్యాలయం ఎదుట ధర్నా.. నిరసనలు



భూత్పూర్ మున్సిపల్ కార్యాలయానికి తాళం వేసి నిరసన తెల్పుతున్న కౌన్సిలర్లు ఇతర నాయకులు

**భూత్పూర్, జనవరి 20, ప్రభాతవార్త :** గడిచిన మూణ్నెల్లుగా భూత్పూర్ మున్సిపాలిటిలో ఎలాంటి పనులు జరగడంలేదని, డెప్యూటేషన్ మీద వచ్చిన జడ్చర్ల మున్సిపల్ కమిషనర్ భూత్పూర్ మున్సిపాలిటీకి ఎప్పుడొచ్చేది.. ఎప్పుడెళ్లేది ఎవరికీ తెలియదని, మున్సిపాలిటీలో పారిశుద్ధ్య పనులు, చెట్లకు నీరు పట్టేది.. హరితవనాలను పట్టించుకునే నాథుడే లేడని, వెంటనే రెగ్యులర్ కమిషనర్‌ను నియమించాలని డిమాండ్ చేస్తూ సోమవారం బీఆర్ఎస్, బీజేపీకి చెందిన పలువురు కౌన్సిలర్లు మున్సిపల్ కార్యాలయానికి తాళం వేసి కార్యాలయం మందు నిరసనలు తెల్పుతూ ధర్నా నిర్వహించారు. ఇక్కడ పనిచేసే గత మున్సిపల్ కమిషనర్ ఇక్కఇ నుంచి అమరచింతకు బదిలీపై వెళ్లగా, అప్పటి నుంచి పర్య వేక్షించే నాథుడే లేక మున్సిపాలిటీలో పనులు స్తంభించి పోయాయని మున్సిపల్ ఫ్లోర్ లీడర్, బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి తూము శ్రీనివాస్‌రెడ్డితో పాటు కౌన్సిలర్లు బాలకోటి, రామకృష్ణ, జాకీర్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులు టి మురళీధర్‌గౌడ్ మేకల సత్య నారాయణ, గడ్డం యాదయ్యతో పాటు బీజేపీ మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఎండి ఫారూక్ నిరసన తెల్పినవారిలో ఉన్నారు.

# దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలి

**ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరించిన జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి**

**మహబూబ్‌నగర్ బ్యూరో జనవరి 20 ప్రభాతవార్త:** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి స్వీకరించిన దరఖాస్తులు పరిశీలించి సత్వరం పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ విజయేందిరబోయి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులను సమావేశ పరచి ప్రజావాణి కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి సమస్యలపై దరఖాస్తు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి తమ పరిధిలో ఉంటే వెంటనే పరిష్కరించాలని లేనిపక్షంలో వారికి తగు సూచనలు ఇవ్వాలని చెప్పారు, శాఖల వారీగా పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమం లో సోమవారం వివిధ శాఖలకు సంబంధించి ప్రజల నుండి 85 దరఖాస్తులు వచ్చినట్లు ఆమె తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

**నారాయణపేటలో..**

**నారాయణపేట టౌన్, జనవరి 20 ప్రభాతవార్త :** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 25 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్‌లో పెటకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బెంషాలం ఆర్డీవో రామచంద్ర, ఏవో జయసుధ, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

**గద్వాలలో..**

**గద్వాల, జనవరి 20 ప్రభాతవార్త:** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ప్రజల నుండి స్వీకరించిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ అధికారులకు సూచించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుండి (45) ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు అందజేసిన అర్జీలను జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్, అదనపు కలెక్టర్లు లక్ష్మి నారాయణ, నర్సింగరావులతో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యల పరిష్కారం కోసం వచ్చిన దరఖాస్తులను ఎప్పటికి అప్పుడు పరిష్కరించాలని తెలిపారు వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



దరఖాస్తులను పరిశీలిస్తున్న చేస్తున్న కలెక్టర్ సంతోష్

# రైతాంగానికి పెద్దపీట:ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 20 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రైతాంగానికి పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. తాడూర్ మండల కేంద్రంలో మండలానికి సంబందించిన 21 మంది రైతులకు ప్రభుత్వం సబ్సిడీ కింద మంజూరు అయిన స్ప్రింక్లర్లను ఎమ్మెల్యే డా.కూచుకుళ్ల రాజేష్ రెడ్డి లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రుణమాఫీ కింద 24 వేల కోట్ల రూపాయలు వెచ్చించిందని, సన్న వడ్లకు బోనస్ ఇచ్చిందని, ఎలాంటి షరతులు లేకుండా రైతుల నుండి ధాన్యం కోనుగులు చేసిందని, వ్యవసాయ యాంత్రీకరణను రైతాంగానికి మరింత దగ్గర చేయడానికి ప్రయత్నిస్తుందని, ఇంకా ఈ నెలలోనే రైతు భరోసా కింద ఒక్కో ఎకరానికి ఏడాదికి 12వేల రూపాయలు జమ చేస్తామన్నారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ ప్రజాప్రభుత్వం రైతుల అభివృద్ధికోసం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే అన్నారు. సంబధిత అధికారులు, నాగర్ కర్నూల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ రమణ రావు, తాడూర్ మండల పీఏసీఎస్ ఛైర్మన్ రామచంద్రా రెడ్డి, జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ వినోద్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, పాల్గొన్నారు.



లబ్దిదారులకు స్ప్రింక్లర్లను అందజేస్తున్న దృశ్యం

# గణతంత్ర దినోత్సవ వేడుకలకు అంగరంగ వైభవంగా అన్ని ఏర్పాట్లు : జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

**నారాయణపేట టౌన్, జనవరి 20 ప్రభాతవార్త :** గణతంత్ర దినోత్సవ వేడుకలను అంగరంగ వైభవంగా అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. సోమవారం వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవ – మిగతా2లో..





మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

# గ్రామ సభలకు విస్తృత ఏర్పాట్లు చేయాలి

- గ్రామ సభలను షెడ్యుల్ ప్రకారం నిర్వహించాలి
- లబ్ధిదారుల ఎంపిక నిరంతర ప్రక్రియ
- అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయడమే ప్రభుత్వ లక్ష్యం
- మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి





మాట్లాడుతున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 20 ప్రభాతవార్త:** ప్రభుత్వం ఈ నెల 26 నుండి ప్రారంభించనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు జారీ, ఇందిరమ్మ ఇండ్ల పథకాల లబ్ధిదారుల గుర్తింపుకు జిల్లాలో నేటి నుండి జనవరి 24 వరకు, గ్రామ సభలకు నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ విజయేందిరబోయి అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టర్ కార్యాలయ మినీ ప్రధాన సమావేశ మందిరంనుండి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపుకలెక్టర్ మోహన్‌రావులతో కలిసి జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి జిల్లాలోని నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు, ఎంపిడిఓలు, తహశీల్దార్‌లు, పంచాయతీ కార్యదర్శుల ఇతర సంబంధిత అధికారులతో కలిసి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జనవరి 26న అమలు చేయనున్న నాలుగు సంక్షేమ పథకాల (రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు)పై ఈ నెల 21 నుండి 24 వరకు గ్రామ సభల నిర్వహణపై వెబెక్స్ సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల వంటి కీలకమైన నాలుగు సంక్షేమ పథకాల అమలును జనవరి 26న ప్రారంభించనున్న నేపథ్యంలో ఈ నెల 21 నుండి 24 వరకు నిర్వహించే గ్రామ సభలను షెడ్యుల్ వారీగా ఖచ్చితంగా సమయపాలన పాటిస్తూ నిర్వహించాలని, ఎక్కడ కూడా నిర్లక్ష్యాని తావు లేకుండా అధికారులందరూ అత్యంత జాగ్రత్తగా ఈ ప్రక్రియను సజావుగా నిర్వహించాలని పేర్కొన్నారు. గ్రామ సభలలో ఫ్లెక్సీలు, త్రాగునీరు, నీడ ఏర్పాటుకు టెంట్, మైక్ సెట్ తదితర మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసుకోవాలని, అన్ని గ్రామ సభల వద్ద నాలుగు పథకాల అర్హుల జాబితాను ప్రదర్శించాలని, గ్రామ సభల్లో వచ్చే ఫిర్యాదులపై రిజిస్టర్‌లను ఏర్పాటు చేసి, అర్జీలను స్వీకరించాలని, గ్రామ సభలలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించాలని ఆదేశించారు., గ్రామ సభలు షెడ్యూల్ సమయం, నిర్వహించే ప్రదేశంపై ముందు రోజూ గ్రామంలో టాంటాం ద్వారా ప్రచారం గావించాలని, గ్రామ సభలు షెడ్యూల్ ఎంపిలు, శాసన మండలి సభ్యులు, శాసనసభ్యులు, ప్రజా ప్రతినిధులకు సమాచారం అందించాలని సూచించారు. గ్రామ సభల షెడ్యూల్ మండల సమాఖ్య, గ్రామ సంఘం అధ్యక్షురాలు కు సమాచారం అందించి మహిళా సంఘాల మహిళలు పాల్గొనేలా చూడాలని అన్నారు ఇందిరమ్మ కమిటీ సభ్యులకు కూడా సమాచారం అందించి భాగస్వామ్యులను చేయాలని అన్నారు ఉపాధి హామీ పనులు నిర్వహించిన కుటుంబాలు గ్రామ సభలకు హాజరు అయ్యేలా చూడాలని అన్నారు. గ్రామ సభలు రాష్ట్రీయ గీతంతో ప్రాంభించాలని అన్నారు. ప్రభుత్వం నుండి వచ్చిన సందేశం చదవాలని అన్నారు రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలలో లబ్దిదారుల జాబితాను గ్రామ సభల్లో చదివి వినిపించాలని అన్నారు. గ్రామ సభలో ప్రజా పాలన లో వచ్చిన రేషన్ కార్డు దరఖాస్తులు, పౌర సరఫరాల శాఖ నుండి అందిన జాబితా, మీ సేవ పోర్టల్‌లో రేషన్ కార్డు లో కుటుంబ సభ్యుల చేరిక దరఖాస్తులు, రుణ మాఫీ జాబితా, వ్యవసాయ యోగ్యమైన, యోగ్యం కాని భూముల లబ్ధిదారుల జాబితా, 202324 సంవత్సరం లో ఉపాధి హామీ పథకం లో 20 రోజుల పని చేసిన కుటుంబాల భూమి లేని వ్యవసాయ కూలీల జాబితా, ఇందిరమ్మ ఇండ్ల ఇంటి స్థలం, ఇంటి స్థలం లేని జాబితా లు ఉండాలని అన్నారు. అభ్యంతరాలుంటే స్వీకరించాలని, కొత్త దరఖాస్తులు కూడా స్వీకరించాలన్నారు. ఎలాంటి అపోహలు తలెత్తకుండా ప్రజలకు స్పష్టంగా వివరించాలని అన్నారు. అర్హులైన అందరికీ నాలుగు సంక్షేమ పథకాలు అందించనున్నట్లు తెలిపారు రేషన్ కార్డులు జారీ, ఇందిరమ్మ ఇండ్ల నిరంతర ప్రక్రియ అని, జాబితాలో పేరు లేకుంటే గ్రామ సభలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు గ్రామ సభలో జాబితా తుది జాబితా కాదని, గ్రామ సభ లో ప్రదర్శించిన జాబితా, కొత్త దరఖాస్తులు స్వీకరించి పరిశీలన అనంతరం ప్రభుత్వ ఆదేశాల ననుసరించి అందరికీ సంక్షేమ పథకాలు అందించడం జరుగుతుందని అన్నారు. నాలుగు పథకాలకు వచ్చిన కొత్తగా దరఖాస్తులు ప్రత్యేక రిజిస్టర్ లు ఏర్పాటు చేసి కుటుంబ హెడ్, కుటుంబ సభ్యులు పేర్లు, ఆధార్ నెంబర్‌లు, కులం ఫోన్ నెంబర్‌లు జాగ్రత్తగా నమోదు చేసుకోవాలని అన్నారు. గ్రామ సభలు నిర్వహణ పై ప్రతి రోజూ నివేదిక అందించాలని కోరారు.

## మైనింగ్ అనుమతులు రద్దు చేయాలి

# మైలారం గ్రామస్తుల ఆందోళన

- గ్రామంలోకి అధికారులు రాకుండా ముళ్ళ కంచే ఏర్పాటు
- పోలీసులతో వాగ్వాదం.. పురుగు మందు డబ్బాలతో హెచ్చరిక



ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 20 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా బాల్మూర్ మండలం మైలారం గ్రామంలోని సర్వే 121 లోని భూమిలో క్వర్జ్ తవ్వకాలకు కేటాయించిన మైనింగ్ అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు ఆందోళన నిర్వహించారు. గ్రామంలోని సర్వే నంబర్ 121 లో 120 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. అందులో గుట్టగా ఉన్న 35 ఎకరాలను క్వార్జ్ తవ్వకాల కోసం మైనింగ్ శాఖ కొందరికి అనుమతులు ఇచ్చింది. కొద్ది రోజుల నుంచి అక్కడ తవ్వకాల పక్రియ మొదలైంది. కాగా మైనింగ్ వలన ప్రకృతి సహజ సంపదతో పాటు.. తమ భూములు, ఇల్లు దెబ్బతినే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అందులో భాగంగా సోమవారం నుంచి రిలే నిరాహారదీక్షలు చేపట్టాలని పిలుపునిచ్చారు. తమ నిరసనను పౌర హక్కుల నేతలు హరగోపాల్, గడ్డం లక్ష్మణ్‌ను ఆహ్వానించారు. అలాగే గ్రామంలోకి అధికారులు, మైనింగ్ నిర్వాహకులు రాకుండా గ్రామంలోని రోడ్డుపై ముళ్ళ కంచే, రాళ్ళు అడ్డుగా పెట్టి నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలియడంతో సిఐ రవీందర్, ఎస్ఐ రమాదేవి గ్రామానికి వెళ్లి ప్రజలకు నచ్చ జెప్పే ప్రయత్నం చేశారు. కానీ వినకపోవడంతో కొందరిని బలవంతంగా అక్కడి నుంచి తరలించారు. దీంతో కొంత మంది మహిళలు పురుగు మందు డబ్బాలు తీసుకొని ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు. మైనింగ్ అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీంతో అందరినీ పోలీసులు అక్కడి నుంచి వెళ్ళగొట్టారు. పౌర హక్కుల సంఘం నేతలను వెల్దండ వద్ద పోలీసులు అడ్డుకుని స్టేషన్ కు తరలించారు. మైలారం గ్రామస్తులు మాత్రం తమ ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసులు

# నేటి నుండి 24వరకు గ్రామ సభల నిర్వహణ

- జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ నాయక్
- గ్రామ సభలకు విస్తృత ఏర్పాట్లు
- గ్రామ సభల్లోనూ దరఖాస్తు తీసుకుంటాం



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

**నారాయణపేట టౌన్, జనవరి 20 ప్రభాతవార్త :** నేటి 21నుండి 24 వరకు గ్రామ సభల నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు చేయడం జరిగినదని, దరఖాస్తు తీసుకుంటామని, లబ్ధిదారుల ఎంపిక అనేది నిరంతర ప్రక్రియ అని, జిల్లా ప్రజలు సహకరించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులందరికి ఇందిరమ్మ ఇల్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీ య భరోసా, రేషన్‌కార్డులు చేరేలా పటిష్ట కార్యాచరణ అమలు చేస్తున్నట్లు, అందుకు గాను ఈ నెల 16 నుండి 20 వరకు క్షేత్ర స్థాయి దరఖాస్తులు పరిశీలన చేయడం జరిగిందని, 21 నుండి 24 వరకు గ్రామసభలు నిర్వహించడం జరుగుతుందనీ జిల్లా ప్రజలు సహకరించాలని జిల్లా తెలిపారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల జారీ ప్రక్రియ ప్రభుత్వం గణతంత్ర దినోత్సవం నుంచి ప్రారంభించనుందని, వ్యవసాయ యోగ్యమైన ప్రతి ఎకరాకు రైతు భరోసా పంట వేసినా, వేయకపోయినా అందుతుందని, రైతులు అనవసర అపోహలు పెట్టుకోవద్దని, రైతు భరోసా పథకానికి ఎటువంటి పరిమితులు లేవని, వ్యవసాయ యోగ్యమైన ప్రతి ఎకరాకు 12 వేలు పెట్టుబడి సహాయం ప్రభుత్వం అందిస్తుందని కలెక్టర్ తెలిపారు. భూమిలేని వ్యవసాయ కూలీల కుటుంబాలకు ఏడాదికి 12 వేలు రూపాయలను అందించనున్నట్లు, ఒక్కో విడతకు 6వేల చొప్పున రెండు విడతలుగా అందించేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని ప్రారంభించనుందని, 2023,24 సంవత్సరానికి ఉపాధి హామీ క్రింద పని చేసిన భూమి లేని రైతు కుటుంబాలకు ఈ పథకం వర్తిస్తుందన్నారు. జిల్లాలో 20రోజులు ఉపాధి హామీ కూలీలుగా పనిచేసిన కార్మికుల జాబితాను తీసుకొని ఆధార్‌కార్డు ట్యాగ్ ప్రకారం పరిశీలిస్తూ భూమిలేని కుటుంబాలను ఎంపిక చేయడం జరుగుతుందని, ఇందిరమ్మ ఇండ్ల సర్వే ద్వారా సొంత భూమి ఉండి ఇండ్లు లేని కుటుంబాల జాబితాను సిద్ధం చేశామని, గ్రామ సభలో అభ్యంతరాలను స్వీకరించడం జరుగుతుందని, గ్రామ సభలో అర్హుల జాబితా గ్రామాల వారీగా సిద్ధం చేసిన తర్వాత నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. గ్రామ సభల్లో ఇచ్చిన దరఖాస్తులను కూడా పరిగణలోకి తీసుకుంటామని తెలిపారు. కుటుంబంలో విభజన అయినవారు కొత్త కార్డు కావాలని తీసుకున్న దరఖాస్తును కూడా పరిశీలిస్తామన్నారు. గతంలో పెండింగ్లో ఉన్న దరఖాస్తులను కూడా పరిశీలిస్తామని అన్నారు. ఇదివరకు ఎప్పుడూ దరఖాస్తుసమర్పించకపోయినా గ్రామాల్లోకి వచ్చే అధికారులకు దరఖాస్తులు ఇవ్వాలని సూచించారు. ఇందిరమ్మ ఇల్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల ప్రభుత్వ సంక్షేమ పథకాలపై సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శులను, ఎంపిడిఓలను సంప్రదించి సందేహాలను నివృత్తి చేసుకోవాలని కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

# నియోజకవర్గ అభివృద్ధి నా లక్ష్యం

- అందరి సహకారంతోనే అభివృద్ధి సాధ్యం
- కాంగ్రెస్‌లో గ్రూపు రాజకీయాలకు తావులేదు
- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి





సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**కల్వకుర్తి, జనవరి20 ప్రభాతవార్త:** కల్వకుర్తి నియోజకవర్గం అభివృద్ధి ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతున్నానని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. సోమవారం కల్వకుర్తి పట్టణంలోని యుటిఎఫ్ భవన్‌లో జరిగిన ప్రింట్ మీడియా ఎలక్ట్రాన్ మీడియా క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా హజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో గ్రూపు రాజకీయాలకు తావు లేదని ఎవరైనా అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని ఆయన సూచించారు. గత పదేళ్లలో ఏనాడు జరగని విధంగా నియోజకవర్గ ప్రజలకు మౌళిక వసతులు మెరుగైన సదుపాయాల కల్పన కోసం కోట్ల రూపాయల నిధులను మంజూరు చేయించి అభివృద్ధి పరుస్తున్నానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి అందరి సహాయ సహకారాలు అవసరమని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. సమిష్టి కృషితోనే కల్వకుర్తి నియోజకవర్గం అభివృద్ధి జరుగుతుందని ఆయన అన్నారు. కల్వకుర్తి మున్సిపాలిటిలో సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి స్థాయిలో చేపట్టామన్నారు. ప్రభుత్వాలకు ప్రజలకు మీడియా వారధిగా ఉందని జనజాగృతంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రాన్ మీడియా పాత పాత్ర గొప్పదని సందర్భంగా పేర్కొన్నారు. బాధ్యతాయుతమైన సమాజంలో నిర్మాణంలో మీడియా కృషి ఎనలేనిదని ఈ సందర్భంగా ఆయన అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ సభ్యులు ఠాగూర్ బాలాజీసింగ్, పీఏసీఎస్ వైస్ ఛైర్మన్ సంజీవ్‌కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రమాకాంత్ రెడ్డి, కాంగ్రెస్ యువనేత చంద్రకాంత్ రెడ్డి, కల్వకుర్తి ఎస్ఐ మాధవరెడ్డి, తలకొండపల్లి మండల పార్టీ అధ్యక్షులు దోకూరు ప్రభాకర్ రెడ్డి, పలు ప్రింట్ మరియు ఎలక్ట్రాన్ మీడియా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి**



రామన్ పాడ్ లో డ్రోన్ మిషన్లతో వరి విత్తనాలు చల్లుతున్న ఎమ్మెల్యే

**కొత్తకోట జనవరి 20 ప్రభాతవార్త :** రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం అని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. సోమవారం మదనపురం మండలం రామన్ పాడ్ గ్రామంలో డ్రోన్ ద్వారా ప్రయోగాత్మకంగా పొలంలో వరి విత్తనాలు వెదజల్లే కార్యక్రమానికి దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్, చిన్నారెడ్డి లు మాట్లాడుతూ ప్రస్తుతం వరి నాట్లు రైతులకు భారంగా మారాయని, నాట్లు వేయడానికి కూలీలు దొరకని పరిస్థితి నెలకొందని – మిగతా2లో..

## ప్రజావాణి ఫిర్యాదులను చట్టప్రకారం పరిష్కరించాలి



ప్రజావాణిలో ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

**వనపర్తి క్రైమ్ జనవరి 20 ప్రభాతవార్త:** ప్రజావాణి సమస్యలను చట్టప్రకారం పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులకు ఎస్పి సూచించారు. సోమవారం వనపర్తి జిల్లా పోలీసు కార్యా లయంలో జిల్లా ఎస్పీ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 11 మంది ఫిర్యాదుదారుల నుండి అర్జీలను స్వీకరించి వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత స్టేషన్‌ల యొక్క ఎస్సైలకు, సిఐ లకు ఫోన్ ద్వారా మాట్లాడి సమస్య స్థితిని పరిష్కారానికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి, పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవల్ని వినియోగించుకుంటూ, వారి వారి సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించుకోనేల, పోలీ సులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా, శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్‌శాఖ పని చేస్తుందని ఎస్పీ తెలియజేశారు. ప్రజా సమస్యలుపై ఫిర్యాదులు నేరుగా స్వీకరిస్తూ ప్రజావాణి కార్యక్రమం ద్వారా సమస్యలు పరిష్కారిస్తున్నామని తెలియజేశారు.

## సిపిఎం మహాసభల గోడపత్రిక విడుదల



గోడపత్రికలను విడుదల చేస్తున్న దృశ్యం

**మాగనూరు, జనవరి 20 ప్రభాతవార్త:** భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిసు (సిపిఎం) రాష్ట్ర 4వ మహాసభల సందర్భంగా 25వ తేదీన సంగారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించే బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పుంజనూర్ ఆంజనేయులు సీనియర్ నాయకులు భరత్‌కుమార్ ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం మాగనూర్ మండల కేంద్రంలో మహాసభలగోడ పత్రికలను, కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం రాష్ట్ర భవిష్యత్తు కోసం సకల జనుల సంక్షేమ కోసం జరిగే సిపిఎం రాష్ట్ర నాలుగవ మహాసభలను జయప్రదం చేయాలని ప్రజ లకు పిలుపు ఇచ్చారు. అసమానతలు లేని సమాజం కోసం నిరంతరం పోరాడుతూ అణగారిన జాతుల పక్షాన నిలబడి పోరాటం చేస్తున్న ఏకైక పార్టీ సిపిఎం మాత్రమేనని అన్నారు. 25వ తేదీన సంగారెడ్డి పట్టణములో పీఎస్ఆర్ గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభను నిర్వహిస్తామని తెలిపారు. ఈ బహిరంగ సభకునారాయణపేట జిల్లాలోని ప్రజలుఅధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని, మహాసభల నిర్వహణకోసం ప్రజలుతమ ఆర్థిక సహకారం అందించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గోవిందరాజ్ నాయకులు కె నరసింహ, నయుం, గోవింద్, ఖాసిం, శివరాజ్, మంగలి సూర్య, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## బిసి పొలిటికల్ జెఏసి మండల అధ్యక్షునిగా నల్ల తిరుపతయ్యగౌడ్



నియామక పత్రం అందజేస్తున్న దృశ్యం

**మూసాపేట, జనవరి20 ప్రభాతవార్త:** మూసాపేట మండల కేంద్రానికి చెందిన నల్ల తిరుపతిగౌడ్‌ను బిసి పొలిటికల్ జెఏసి మూసాపేట మండల అధ్యక్షునిగా నియమిస్తూ మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జేఏసీ రాష్ట్ర చైర్మన్ రాచాలయుగంధర్ గౌడ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాచాల చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా తిరుపతయ్య గౌడ్ మాట్లాడుతూ త్వరలోనే గ్రామ కమిటీలు వేస్తామని, బీసీలను చైతన్యం చేసి బీసీల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తూ, బీసీల రాజ్యాధికారం కోసం పాటు పడతానన్నారు. నాపై నమ్మకముంచి మండల అధ్యక్షునిగా బాధ్యత అప్పజెప్పిన స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ కృతజ్ఞతలు తెలియజేశారు.

## రాజ్యాంగం అత్యంత పవిత్రమైనది

● బీజేపీ పట్టణ అధ్యక్షుడు కావలి క్రాంతికుమార్

**పెబ్బేరు జనవరి 20 ప్రభాతవార్త:** పెబ్బేరు, భారతీయ జనతా పార్టీ నిర్వహించిన సంవిధాన్ గౌరవ్ అభియాన్ కార్యాచరణ నిమిత్తం బీజేపీ పట్టణ అధ్యక్షుడు కావలి క్రాంతికుమార్ ఆధ్వర్యంలో సోమవారం పెబ్బేరు మున్సిపల్ కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం 26నవంబర్ 2015నతొలిసారిగా రాజ్యాంగ దినోత్సవాన్ని దేశవ్యాప్తంగా నిర్వహించిందని అప్పటి నుంచి ప్రతి సంవత్సరం రాజ్యాంగ దినోత్సవం జరుపుకుంటూ మనం రాజ్యాంగాన్ని గౌరవించుకుంటున్నామని అన్నారు. దేశంలోని ప్రతి పౌరుడికి రాజ్యాంగం అత్యంత పవిత్రమైనదని గతనెలలో భారత రాజ్యాంగం 75వ వార్షికోత్సవంపై పార్లమెంటు ఉభయసభల్లో సమగ్ర చర్చ జరిగిందని ప్రధానమంత్రి నేతృత్వంలో రాజ్యాంగ నిర్మాత భారతరత్న డాక్టర్ అంబేద్కర్ గౌరవార్థం పంచ తీర్థాల అభివృద్ధితో పాటు పేదలు, అణగారిన వర్గాల సంక్షేమం కోసం అనేక పథకాల ద్వారా చారిత్రాత్మక కార్యక్రమాలునిరంతరం జరుగుతున్నాయని అన్నారు. ఈ నెల 19,20, జిల్లా వారీగా సంవిదన్ గౌరవ అభియాన్ కార్యశాల 22 ,23న ఎస్సీ, ఎస్టీ బస్తీలలో సమావేశాలు 24,25న కళాశాలలు హాస్టల్లు ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టల్లో సంపర్క్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సేవలు రాజ్యాంగం పట్ల బిజెపి నిబద్ధతను యువతలో ప్రచారం 26న ప్రతి బూతులు గణతంత్ర దినోత్సవం జరుపుకోవడం భారత రాజ్యాంగంలోని ప్రవేశిక, ఆదేశిక సూత్రాలను చదివి వినిపించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు రంగస్వామిగౌడ్, నరసింహనాయుడు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## చదువు విలువ తెలుసుకోండి

**చిన్న చింతకుంట, జనవరి 20 ప్రభాతవార్త:** బడి బయట ఉండే పిల్లలు చదువు విలువ తెలుసుకుంటే బడిబాట పడతారని సిఆర్‌పి విజయ్ సింహ తెలిపారు. సోమవారం ఓఎస్‌సి సర్వేలో భాగంగా సీతారాంపేట గ్రామంలో సిఆర్పి విజయసింహ ఇంటింటికి వెళ్లి బడి బయట ఉండే పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులకు చదువు విలువ తెలియజేసి పాఠశాలల్లో చదువు కుంటే విజ్ఞానంతో పాటు వినయ విధేయతలు నేర్చుకుంటారని తద్వారా సమాజంలో మంచి పేరు సంపాదించుకుంటారని పిల్లల తల్లిదండ్రులకు వివరించి ఒప్పించి ప్రభుత్వ పాఠశాలలో ఐదుగురు బాలలను చేర్పించారు. బాలల పూర్తి వివరాలను ప్రబంద్ పోర్టల్ లో నమోదు చేయడం జరిగిందన్నారు. ఈ సర్వేకు సహకరించిన గ్రామస్తులకు, బాలల తల్లిదండ్రులకు సిఆర్‌పి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వినోద్ కుమార్, ఉపాధ్యాయురాలు హేమలత తదితరులు పాల్గొన్నారు.

## ప్రొఫెసర్ హరగోపాల్ అరెస్టు

● ప్రజల హక్కులను కాలరాయరాదు
● ఖనిజాలను తోవడం అంటే మంచిది కాదు : ప్రొఫెసర్ హరగోపాల్



**వెల్దండ, జనవరి 20 ప్రభాతవార్త:** బల ప్రయోగం చేసి, ప్రభుత్వం ప్రజలు చేసే నిరసనను ఆపాల్సిన అవసరం ఏమి వచ్చిందని ప్రజల హక్కులను కాలరాయరాదని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. బల్మూరు మండలం మైలారం గ్రామంలో ఖనిజ తవ్వకాలను ఆపాలని అక్కడి ప్రజలు చేపట్టిన నిరసన కార్యక్రమానికి బయలుదేరి వెళుతున్న ప్రొఫెసర్ హరగోపాల్, పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గద్దం లక్ష్మణ్‌ను జిల్లాముఖద్వారమైన వెల్దండ, పోలీస్‌స్టేషన్ వద్ద సోమవారం పోలీసులు వారిని అడ్డుకొని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజలుఆకలి నైనా భరించగలరని, స్వేచ్ఛమీద దాడి జరిగితే భరించరనే నినాదంతోనే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది అదే స్వేచ్ఛకు భంగం కలిగిస్తే ఎట్లా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా ఖనిజవనరులు తొవ్వుకోవడానికి ఒక వర్గం వచ్చేసింది, తొందరగా అధిక లాభాలు వస్తాయని, వారి దృష్టి దాని మీద పడింది, అప్పటి ప్రభుత్వంపై యురేనియంప్రాజెక్టు విషయంపైపెద్ద ఉద్యమమే నడిపి నిలుపుదల చేశామన్నారు. ప్రభుత్వాలు, ప్రజలు చెప్పే విషయానికి కూడా వినాల్సిన బాధ్యత వారిపై ఉందని, అక్కడి స్థానిక ఎమ్మెల్యే బాధ్యత తీసుకొని ప్రజలతో మాట్లాడి ఖనిజ తవ్వకాలపై పున సమీక్షించి ప్రజలను ఒప్పించాలి లేదంటే, ఖనిజ తవ్వకాలనైనా ఆపాలి, ఖనిజాలను తవ్వడం అంటే మంచిది కాదు, మైలారం గ్రామంలోని ప్రజలు అక్కడి అడవిని నమ్ముకుని పచ్చని పొలాలు చెట్లును నమ్ముకొని ప్రజలు వాటిపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. రాష్ట్ర అభివృద్ధి అవసరమనుకుంటే ప్రభుత్వం ప్రజలతో మాట్లాడాలి మాకు అనుమతించినట్లయితే అక్కడి వెళ్లి ప్రజలతో మాట్లాడే వాళ్ళం. ఉద్యమాలు అంటేనే ప్రజాస్వామ్యం. ప్రజలు చెప్పేది వినాలి కానీ లేదంటే ఆ ప్రజాస్వామికమవుతుందని అన్నారు. అనంతరం వారిని సొంతపూచికత్తుపై పోలీసులువిడుదలచేశారు. హైదరాబాద్ బయలుదేరి వెళ్లారు కార్యక్రమంలో పౌర హక్కుల నాయకులు, గద్దం చేతన్ అడ్వకేట్ లక్ష్మణ్ ఉన్నారు.

# గ్రామ సభలకు నేనూ వస్తా..

◆ ఆకస్మికంగా హాజరవుతా
◆ అర్హులందరి పేర్లు ఆమోదించండి
◆ ఇందిరమ్మ కమిటీలో లేని కాంగ్రెస్ కార్యకర్తలు కూడా పాల్గొనాలి
◆ జడ్చర్ల ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి

**జడ్చర్ల, జనవరి 20 ప్రభాతవార్త :** ఈనెల 21 నుంచి 25 వ తేదీ వరకు జరగనున్న గ్రామ సభల్లో ఇందిరమ్మ కమిటీ సభ్యులు తప్పనిసరిగా పాల్గొని అర్హులందరికీ న్యాయం జరిగేలా చూడాలని జడ్చర్ల ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్ రెడ్డి పిలుపునిచ్చారు. తాను కూడా కొన్ని గ్రామ సభలకు ఆకస్మికంగా హాజరు అవుతానని వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల మంజూరు లో ఏ ఒక్క పేదకుటుంబానికి అన్యాయం జరగకుండా చూడాలని ఆయన అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులను కోరారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో ఏఒక్క పేద కుటుంబానికి అన్యాయం జరగకుండా చూడాల్సిన బాధ్యత ఆయా గ్రామాలకు చెందిన ఇందిరమ్మ కమిటీ సభ్యులు, అధికారుల పైననే ఉందని అనిరుధ్‌రెడ్డి గుర్తు చేశారు. అధికారులు ఆమోదించిన జాబితాలలో అనేకమంది అర్హులపేర్లు లేవని ఇప్పటికే ఫిర్యాదులు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ఆయా గ్రామాలకు చెందిన అర్హులందరి పేర్లను జాబితాలో చేర్చి వాటిని గ్రామసభలలో ఆమోదించాలని సూచించారు. ఈ విషయంలో అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులకు సహకరించాలన్నారు. గ్రామసభలలో ఇందిరమ్మ కమిటీ సభ్యులతో పాటుగా ఆయా గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు కూడా పాల్గొని గ్రామసభలు విజయవంతం అయ్యేలా చూడాలన్నారు. తాను కూడా గ్రామ సభలలో ఆకస్మికంగా పాల్గొంటానని వెల్లడించారు. అధికారులు గ్రామ సభలలో ఆమోదించిన జాబితాలను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి కూడా పంపాలని కోరారు. గ్రామ సభలలో అర్హులైన వారి పేర్లను జాబితాలోకి చేర్చడంలో ఇబ్బందులు ఎదురైన పక్షంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి స్వయంగా గాని, లేదా 83280 09760 ఫోన్ నెంబర్ ద్వారా గాని ఫిర్యాదులు చేయాలని అనిరుధ్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## రేషన్ కార్డుల విషయంలో అసత్య ప్రచారాలు నమ్మొద్దు

◆ అచ్చంపేట రెవెన్యూ డివిజన్ అధికారిణి మాధవి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న అర్‌డిఓ మాధవి

**ఉప్పునుంతల, జనవరి 20 ప్రభాతవార్త:** అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందించుటకు చర్యలు తీసుకుంటున్నట్లు అచ్చంపేట రెవెన్యూ డివిజన్ అధికారిణి మాధవి తెలిపారు. సోమవారం మండల కేంద్రమైన ఉప్పునుంతల రైతువేదికలో అధికారులతో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ అన్ని మండలాల పరిధిలో గ్రామాల్లో పరిశీలనకు వచ్చిన అధికారులు, సిబ్బంది పంచాయతీలలో నేటి నుంచి నిర్వహిస్తున్న గ్రామసభలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని, గతంలో ప్రజాపాలన కార్యక్రమంలో జిల్లా పేపర్‌పై స్వీకరించిన దరఖాస్తులు, గ్రామాల్లో నిర్వహించిన రైతు భరోసా సర్వే లో గుర్తించినవారిని పరిగణనలోకి తీసుకుంటామని, ఇంకా ఎవరైనా మిగిలి ఉన్న గ్రామ సభలలో తిరిగి దరఖాస్తు చేసుకోవచ్చని ఆర్డీఓ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా తీసుకొని నేటి నుంచి 24 వరకు గ్రామాల్లో జరిగే గ్రామ సభలను విజయవంతం చేయాలని ఆమె కోరారు. ఈనెల 26 తేదీ నుంచి అమలు చేయనున్న నేపథ్యంలో ఎలాంటి అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని ఆర్డిఓ కోరారు. సమీక్షా సమావేశంలోఆర్డిఓ మాధవి, తహసీల్దార్ ప్రమీల, ఎంపిడిఓ మోహన్ లాల్, మండల ప్రత్యేక అధికారి చందు నాయక్, ఉప తహసీల్దార్ కేశవ్, మండల వ్యవసాయ అధికారి రమేష్, మండల పంచాయతీ అధికారి నారాయణ, పిఆర్ ఎఇ మహేష్, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూసిబ్బంది, వ్యవసాయ శాఖ, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సమగ్ర పరిశీలనతోనే లబ్ధిదారుల ఎంపిక

◆ ఎంపీడీఓ మోహన్‌లాల్



లక్ష్మాపూర్‌లో క్షేత్రస్థాయి సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ మోహన్‌లాల్

**ఉప్పునుంతల, జనవరి20 ప్రభాతవార్త:** అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు లబ్ధిదారుల ఎంపిక సమగ్ర పరిశీలనతో జరుగుతుందని ఎంపీడీఓ మోహన్‌లాల్ అన్నారు. సోమవారం మండలంలో నిర్వహిస్తున్న సర్వేను పరిశీలించారు. ప్రతి నిరుపేదకు పథకాలు అందించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా నిర్ణయంపై గ్రామాలలో పంచాయతీ రాజ్, రెవెన్యూ శాఖ, వ్యవసాయ శాఖ వారి ఆధ్వర్యంలో సంయుక్తంగా మండలంలోని అన్ని సర్వే నిర్వహించడం జరిగిందని ఎంపిడిఓ మోహన్ లాల్ పేర్కొన్నారు. రేషన్ కార్డుల కోసం ప్రజా పాలనలో తెల్ల కాగితంపైన దరఖాస్తు చేసుకున్న వారికి, మీ సేవలో పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను పరిగణనలోకి తీసుకుంటున్నామని తెలిపారు. నేటి నుంచి నిర్వహించే గ్రామ సభలో అభ్యంతరాలను, ప్రజా పాలన, మీసేవ కేంద్రాల ద్వారా కొత్త రేషన్ కార్డులకు, కొత్త సభ్యుల చేర్పులకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని ఎంపీడీఓ స్పష్టం చేశారు. కులగణన సర్వే ఆధారంగా రేషన్ కార్డులు ఎవరైనా కుటుంబ సభ్యులు లేని వాటి దరఖాస్తులను మీ సేవ కేంద్రాల్లో వచ్చిన దరఖాస్తుల ఆధారంగా క్షుణ్ణంగా సర్వే జరిగిందని అన్నారు. సర్వే పూర్తి నివేదికపై గ్రామ సభలో చదివి వినిపించడం జరుగుతుందని, సర్వే ఆధారంగా ఉన్న లబ్ధిదారుల ముసాయిదా జాబితాను ప్రదర్శించడంజరుగుతుందని వివరించారు. అందులో ఏమైనా అభ్యంతరాలు వస్తేకచ్చితంగా స్వీకరిస్తామని ఎంపిడిఓ వివరించారు. గ్రామ సభలకు అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొనాలని, రైతు భరోసా కింద సాగుకు అనువుగా లేని భూముల జాబితాను అత్యంత గా జాగ్రత్తగా గుర్తించి అర్హులైన వారిని ఎంపిక చేయడం చాలా ముఖ్యమన్నారు.

## ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

● రేషన్ కార్డులపై అపోహలు వద్దు
● మండల కాంగ్రెస్ అధ్యక్షులు నరేందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మండల అధ్యక్షులు నరెందర్‌రెడ్డి

**చిన్న చింతకుంట, జనవరి20 ప్రభాతవార్త:** ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నరేందర్‌రెడ్డి పార్టీ శ్రేణులకు సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని మాజీ జెడ్పి చైర్ పర్సన్ స్వర్ణ సుధాకర్ రెడ్డి స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలు రేషన్ కార్డులపై ఆందోళన చెందవద్దన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు అర్హతల ఆధారంగా సంక్షేమ పథకాలు అందిస్తుందని దీనిపై అపోహలు వద్దని ఆయన తెలిపారు. రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియని అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి అందుతాయన్నారు. ఇల్లు లేని వారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు అవుతాయని అదే విధంగా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద అర్హులైన వారికి సంవత్సరానికి రూ.12వేలు అందిస్తుందన్నారు. ప్రతి వర్గానికి సంక్షేమ పథకాలను అందించే ధ్యేయంగా రేవంత్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. మంగళవారం మండలంలోని లాల్‌కోట కు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్యే జి మధుసూదన్‌రెడ్డి, జిల్లాకలెక్టర్ విజయయేంద్ర బోయి హాజరవుతారన్నారు. గ్రామంలోని గ్రామ సచివాలయము, ఆరోగ్య ఉప కేంద్రాన్ని ప్రారంభం అనంతరం నిర్వహించే గ్రామ సభకు పాల్గొంటారన్నారు. మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో విండో చైర్మన్ సురేందర్ రెడ్డి, పార్టీ నాయకులు సుధాకర్ రెడ్డి, వట్టెం శివకుమార్, ప్రదీప్‌రెడ్డి, ఎస్‌వెంకటేష్, రంజిత్ కుమార్‌రెడ్డి, జిజిపాల్, గంజి బాలరాజు మధుసూదన్‌రెడ్డి ప్రతాప్, పొర్లవెంకటేష్, సుందర్, చిరంజీవి యాదవ్ పాల్గొన్నారు.

## అవగాహనతోనే సైబర్ నేరాల కట్టడి

**చిన్న చింతకుంట, జనవరి 20 ప్రభాతవార్త:** గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు సైబర్ నేరాలపై అవగాహనతోనే కట్టడి చేయవచ్చని స్థానిక ఎస్సై ఆర్ శేఖర్ తెలిపారు. సోమవారం కౌకుంట్ల మండలం దాసర్‌పల్లి గ్రామంలో రోడ్డు భద్రత నియమాలు, సీసీ కెమెరాల ఏర్పాటు, క్రైమ్ నేరాలతో ఇబ్బందులుతదితర అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు వల్ల నేరాలను కట్టడి చేయవచ్చని గ్రామంలో సీసీ కెమెరా ఏర్పాటుకు ప్రజలు సహకారం ఉండాలని ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను పాటించాలన్నారు. మైనర్లకు ద్విచక్ర వాహనాలను ఇవ్వరాదని అలాఇస్తే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే ప్రమాదాల బారిన పడతారని తద్వారా కుటుంబం వీధిన పడుతుందని ఆయన తెలిపారు. సైబర్ నేరాలగురైతే వెంటనే పోలీసులను సంప్రదించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విప్‌ను కలిసిన డిసిసి ప్రధాన కార్యదర్శి జిల్లెల్ల

**ఉప్పునుంతల, జనవరి20 ప్రభాతవార్త:** డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డా.రామ చంద్రు నాయక్‌ను సోమవారం నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్‌పార్టీ ప్రధానకార్యదర్శి జిల్లేలజగత్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా వెల్టూరు గ్రామాన్ని మండలకేంద్రంగాప్రకటించాలనిఈసందర్భంగా కోరినట్లు తెలిసింది.

## విద్యార్థులకుస్టడీ మెటీరియల్ పంపిణీ

**కొత్తకోట జనవరి20 ప్రభాతవార్త :** కొత్తకోట మున్సిపాలిటీలోని అంబేద్కర్ విజ్ఞాన కేంద్రంలో జే.ఎస్.రాములు ఫౌండేషన్ స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో ఐదవ తరగతి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ప్రవేశం కొరకు విద్యార్థులకు ఉచిత శిక్షణ కార్యక్రమం ఉపాధ్యాయులు సి.ఏ.అనిల్, జే.అనిల్ ల సహకారంతో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జె. ఎస్.ఆర్.ఫౌండేషన్ నిర్వాహకులు ఉచిత స్టడీ మెటీరియల్, నోటు పుస్తకాలు, పెన్నులు, విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు అమృతరాజు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో ఇంత మంచి అవకాశాన్ని ఉపయోగించుకుని చదువుకు అధిక ప్రాధాన్యత నివ్వాలని, భవిష్యత్తులో ఉన్నత ఉద్యోగాలు పొందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు సతీష్ రాజు, దయానందరాజు, మహిమ రాజు, కర్ణ కుమార్, మోహన్, కళ్యాణ్ పాల్గొన్నారు.

## యువత క్రీడల్లో రాణించాలి

■ దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి



**చిన్నచింతకుంట, జనవరి20 ప్రభాతవార్త:** గ్రామీణ ప్రాంతాలలోని యువత క్రీడల్లో రాణించాలని స్థానిక ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి అన్నారు. సోమవారం మద్దూర్ గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా జిల్లా స్థాయిటెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న విజేతలకు సీల్డ్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలనిఓటమికి కృంగిపోకుండా గెలుపుకు సాధన ముఖ్యమని ఆయన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తుందని ఆయన తెలిపారు. ఈ క్రీడల్లో మొదటి బహుమతి సాధించిన అమరచింత జట్టుకు గ్రామకాంగ్రెస్ పార్టీఅధ్యక్షులు దామోదర్ యాదవ్‌సీల్డ్‌తో పాటు రూ. 20 వేలు నగదు బహుమతి రన్నర్‌గా నిలిచిన సీసీకుంట జట్టుకు సీల్డ్‌తో పాటు పదివేల నగదును మాజీ సర్పంచ్ అంజనమ్మ బాలవర్ధన్‌లు ఎమ్మెల్యే చేతుల మీదుగా విజేతలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులుమండల పార్టీఅధ్యక్షులు నరేందర్‌రెడ్డి, ఎస్. వెంకటేష్, వట్టెంశివకుమార్, మహమూద్, యూత్ మండల అధ్యక్షులు రంజిత్ రెడ్డి, సురేందర్‌గౌడ్, గంజిబాలరాజ్, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

## నూతన తహసీల్దారుకు సన్మానం

**కృష్ణ, జనవరి20 ప్రభాతవార్త:** కృష్ణ మండల నూతన తహసిల్దార్‌గా బాధ్యతలుచేపట్టిన బి. వెంకటేష్‌ను సోమవారం పీఏసీఎస్ డైరెక్టర్ తెలంగాణ గౌడ సంఘం వైస్ చైర్మన్ విజయ్ గౌడ్ రెవెన్యూ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి, సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విజయ్‌గౌడ్ మాట్లాడుతూ మండలంలోని పేద ప్రజల భూసమస్యల పరిష్కా రానికి సహకరిస్తూ, సకాలంలో వారి పనులు జరిగేలా చూడాలని, ఈ విషయంలో ఎల్లవేళలా మీకు మా మద్దతు ఉంటుందని అన్నారు.

## దరఖాస్తుల పరిశీలన

**ఉప్పునుంతల, జనవరి 20 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఉప్పునుంతలలో వచ్చిన దరఖాస్తులను సోమవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో రేషన్ కార్డులకు సంబంధించిన దరఖాస్తులురావడంతో నేడు జరిగే గ్రామసభలో ముసాయిదా జాబితా విడుదల చేసేందుకు రంగం సిద్ధం చేశారు. అర్హులైన వారికి ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు అందజేయడం జరుగుతుందని ఎలాంటి అనుమానాలు లేకుండా ప్రతి ఒక్కరు గ్రామసభ హాజరుకావాలని ఉపతహసీల్దార్ కేశవ్, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్‌లు కోరారు.

**గ్రామసభను విజయవంతం చేయండి: ఉప తహసీల్దార్ కేశవ్** మండల కేంద్రమైన ఉప్పునుంతల గ్రామపంచాయతీ ఆవరణలో నేడు మంగళవారం జరిగే గ్రామసభను విజయవంతం చేయాలని సర్వే నిర్వాహకులు, ఉప తహసీల్దార్ కేశవ్ పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న నాలుగు పథకాలపై నేడు గ్రామసభ విజయవంతం చేయాలని ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన కోరారు.

## 21 నుంచి 24 వరకు గ్రామ సభలు నిర్వహించాలి

**మద్దూర్, జనవరి20 ప్రభాతవార్త:** మద్దూరు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో 21 తేదీ నుంచి 24వ తేదీ వరకు గ్రామ సభలు నిర్వహించి రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ రైతు భరోసా పథకాల గురించి లబ్ధిదారులకు తెలియజేయాలని ఊర్లో దప్పు చాటింపు చేయాలనిఎంపీడీవో కార్యదర్శులకు తెలియజేశారు. గ్రామసభలో లబ్ధిదారులను ఎంపిక చేసి ప్రభుత్వానికి నివేదిక పంపాలనిపంచాయతీ కార్యదర్శులకుఒకప్రకటనలో తెలిపారు.

## మద్దూర్ మండల ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఎన్నిక

**మద్దూర్, జూన్20ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా మద్దూర్ మండల కేంద్రంలో సోమవారం ఎమ్మార్పీఎస్ మండల నూతన కమిటీ ఎన్నిక చేశారు. మండల అధ్యక్షునిగా కొర్రివోని నరేష్‌కుమార్, ఉపాధ్యక్షునిగా ఎడ్ల పున్నయ్య, ప్రధాన కార్యదర్శిగా వెంకటేష్, అధికార ప్రతినిధిగా మ్యాతరి రాములు, కోశాధికారిగా కేశవులు ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు మాట్లాడుతూ మండల కమిటీ ఎన్నుకోవడం మంచి విషయమన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలులోకి వచ్చేవరకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పిలుపుమేరకు ఫిబ్రవరి 7న హైదరాబాదులో జరగబోయే లక్షడప్పులు వెయ్యి గొంతుకల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనిప్రతి గ్రామం నుండి మండల వ్యాప్తంగా భారీ ఎత్తున తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మద్దూర్ మండల కమిటి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నూతన సగర సంగం క్యాలెండర్ ఆవిష్కరణ

**మక్తల్ టౌన్ జనవరి 20 ప్రభాతవార్త:** సగర సంఘం 2025 క్యాలెండర్ ఆవిష్కరణ మక్తల్ శాసనసభ్యులు డా.వాకిటి శ్రీహరి చేతుల మీదగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సగర సంగం జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు చెన్నయ్య సాగర్ సూరి హనుమంతు ఆంజనేయులు అనంత ప్రసాద్, వెంకటేష్‌సగర సంఘం రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

## ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆర్‌డిఓ

**ఉప్పునుంతల, జనవరి 20 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఉప్పునుంతలలో ఉన్న 30 పడకల ఆసుపత్రిని సోమవారం అచ్చంపేట రెవెన్యూ డివిజన్ అధికారిణి మాధవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విధులలో వైద్య సిబ్బంది లేకపోవడంతో ఉన్న స్టాఫ్ నర్స్‌తో చర్చించారు. విధుల పట్ల నిర్లక్ష్యం పని చేస్తున్న వైద్య సిబ్బందిపై చర్యలు తప్పవని ఆర్‌డిఓ హెచ్చరించారు. రోజు ఎంతమందికి ఓపి చూస్తున్నారని, ఎంతమంది డాక్టర్లు పనిచేస్తున్నారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వైద్య సిబ్బంది విధుల పట్ల పూర్తి నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్న సిబ్బంది పట్ల ఆర్డిఓఆరా తీశారు. ఆర్‌డిఓ మాధవి తెలిపారు. అనంతరం ఆర్‌డిఓ వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

## మైనారిటీ నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

**గద్వాల జనవరి20 ప్రభాతవార్త:** మైనారిటీ నిరుద్యోగ యువతకు వివిధ ఉద్యోగాల పరీక్షలపై ఉచిత శిక్షణా తరగతుల కోసం దరఖాస్తుల గడువును 15 ఫిబ్రవరి 2025 వరకు పొడిగించినట్లు జిల్లా మైనారిటీస్ సంక్షేమ అధికారి ఎం.పి. రమేష్ బాబు ఒక ప్రకటనలోతెలిపారు. తెలంగాణ మైనారిటీస్ సంక్షేమ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఈ ఉచిత శిక్షణా తరగతులు గ్రూప్-1,2,3,4, ఆర్ఆర్‌బి, ఎస్ఎస్సీ, బ్యాంకింగ్ తదితర పరీక్షలపై నాలుగు నెలల పాటు ఉచిత శిక్షణా తరగతులు అందించబడతాయని పేర్కొన్నారు. ఆసక్తి గలమైనారిటీ అభ్యర్థులు తమ సంబంధిత ధృవపత్రాలను జతచేసి దరఖాస్తులను 15 ఫిబ్రవరి 2025 సాయంత్రం 5 గంటల లోపు జిల్లా మైనారిటీస్ సంక్షేమ శాఖ కార్యాలయం, రూమ్‌నం.ఎఫ్8, ఐడీఓసీ కాంప్లెక్స్, జోగుళాంబ గద్వాల వద్ద సమర్పించగలన్నారు.

## సిపిఎం మహాసభలకు తరలిరండి

**మక్తల్, జనవరి20 ప్రభాతవార్త:** ఈనెల 21 నుంచి సంగారెడ్డిలో జరిగే సిపిఎం నాల్గవ రాష్ట్ర మహాసభలకు నారాయణపేట జిల్లా నలుమూలల నుంచి సిపిఎం శ్రేణులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గోవిందరాజు పిలుపునిచ్చారు. ఈ మేరకు మహాసభలకు సంబంధించిన గోడపత్రికలను సోమవారం ఆయన మక్తల్ మండలంలోని దాసర్‌దొడ్డిలో ఆవిష్కరించారు. ఈ నెల 21 నుంచి 24 వరకు మహాసభల నిర్వహణ అనంతరంఈనెల 25నభారీ బహిరంగ సభను నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అశోక్, శివప్ప, ఎల్లప్ప, అంజప్ప, శంకరప్ప, అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.

## సావిత్రిబాయి పూలే, ప్రజా గాయకుడు గద్దర్ విగ్రహం ఏర్పాటు చేయాలని చైర్మన్ వినతి

**గద్వాల జనవరి 20 ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లాలోని పాత బస్టాండ్ సమీపంలో చదువుల తల్లి సావిత్రిబాయి పూలే, ప్రజా గాయకుడు గద్దర్ విగ్రహం ఏర్పాటు చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సమితి సభ్యుడు అశన్న మాట్లాడుతూ గద్వాల లోనీ అనేక చోట్ల ఎంతో గొప్ప చరిత్ర కలిగిన మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేసారు. అలాగే సామాన్య ప్రజలకు చదువు నేర్పించడానికి మన దేశ మొదటి మహిళ ఉపాధ్యాయురాలుగాపేరుపొందిన సావిత్రిబాయి పూలే, ప్రజా గాయకుడుఅయినా గద్దర్‌అనేక ప్రజా పోరాటాలలో పాటలు పాడి, ఉద్యమాలను విజయవంతం చేశాడని, అందువలన గద్వాల లోనీ పాత బస్టాండ్ సమీపంలో ఉన్న వైస్సార్ విగ్రహం ముందున్న గ్రీల్ లో సావిత్రిబాయ్ పూలే, గద్దర్ విగ్రహాలను ఏర్పాటు చేయాలని సోమవారం గద్వాల మున్సిపల్ చైర్మన్ బి.ఎస్ కేశవ్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నాగర్ దొడ్డి వెంకటరాములు, అతీక్ రహమాన్, బీఎస్పివినోద్ కుమార్, ప్రభాకర్, ఇక్బాల్ పాషా, తదితరులు పాల్గొన్నారు.

## పథకాలు నిరంతర ప్రక్రియ : జిల్లా కలెక్టర్

**గద్వాల జనవరి 20 ప్రభాతవార్త:** జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందిస్తామని, ఇదొక నిరంతర ప్రక్రియ అని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం జారీ చేసిన ప్రకటనలో కలెక్టర్ నూతన రేషన్ కార్డులు జారీ, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా తదితర పథకాలపై ప్రజలు ఆందోళన చెందకుండా ఉండేందుకు కలెక్టర్ స్పష్టంగా తెలియజేశారు. జిల్లాలో ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఈ ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందని, అర్హులైన ప్రతి ఒక్కరికి ఈ పథకం అమలు జరిగే విధంగా చర్యలు చేపట్టడం జరుగుతుంది అన్నారు. ప్రస్తుత జాబితాలో పేర్లు లేని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, జిల్లాలోని అన్ని మండల కేంద్రాలలో, మున్సిపాలిటీలు, జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిరంతరంగ ప్రజా పాలన కేంద్రాలను నిర్వహించి దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతీ ఒక్కరికీ రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలు అందే వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. ప్రస్తుత జాబితాలో పేర్లు లేని వారు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోని వారు కూడా నేటి నుండి 24 వరకు జరిగే గ్రామసభలలో దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి పథకాలను అమలు పరచడం జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు.

## పౌరహక్కుల నేత హరగోపాల్ అరెస్ట్ దారుణం

◆ ప్రొఫెసర్ హరగోపాల్ అరెస్టును తీవ్రంగా ఖండించిన మాజీ మంత్రి

**వనపర్తి క్రైమ్ జనవరి 20 ప్రభాతవార్త:** ఇది ప్రజాపాలన కాదు ప్రజలను పీడించే పాలన అని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అచ్చంపేట నియోజకవర్గం బల్మూరు మండలం మైలారంలో మైనింగ్ కు వ్యతిరేకంగా గ్రామస్తుల నిరసనకు మద్దతు తెలిపేందుకు వెళ్లిన ప్రొఫెసర్ హరగోపాల్, ఇతర ప్రజాసంఘాలనాయకులను అరెస్ట్ చేయడం కాంగ్రెస్ సర్కారు నియంతృత్వ పాలనకు నిదర్శనం నిరంజన్ రెడ్డి అన్నారు. ప్రొఫెసర్ హరగోపాల్ ప్రశ్నించే గొంతుక అని ప్రజల జీవనవిధానానికి భంగం కలిగించే మైనింగ్ ఆపాలని పోరాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్‌ను అరెస్టు చేయడం ప్రశ్నించేవారిని అణగదొక్కడమే అని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీకి మద్దతుఇచ్చిన మేధావులు ఇప్పటికైనా భ్రమలు వీడి ప్రజాపక్షాన నిలబడాలని ఆయన సూచించారు.

## లేబర్ కోడ్ రద్దుకై ఫిబ్రవరి 5న దేశవ్యాప్త నిరసనలు

**వనపర్తి క్రైమ్ జనవరి 20 ప్రభాతవార్త:** కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం తక్షణమే లేబర్ కోడ్ లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 5వ తేదీన భారత దేశవ్యాప్తంగా కార్మిక నిరసన కార్యక్రమానికి యావత్ కార్మిక వర్గం శ్రీకారం చుట్టాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ అన్నారు. తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) నేతృత్వంలో రూపొందించిన 2025 వాల్ క్యాలెండర్‌ను సోమ వారం వనపర్తి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పి.సురేష్ మాట్లా డుతూ కార్మిక సంఘాలు అనేక పోరాటాలు చేసి బ్రిటిష్ కాలం నుండి నేటివరకు సాధిం చుకున్న అనేక కార్మిక చట్టాలను బిజెపి సర్కార్ నాలుగు కోడ్‌లుగా విభజించి 44 కార్మిక చట్టాలను రద్దు చేసిందని మండిపడ్డారు. దీని ఫలితంగా కోటానుకోట్ల కార్మిక వర్గం అనేక హక్కులకు సంక్షేమాలకు దూరమయ్యే ప్రమాదందాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల పని చేస్తున్న పారిశుద్ధ్య సెక్యూరిటీ పేషంట్ కేర్‌సూపర్వైజర్ కార్మికులను ప్రభుత్వం క్రమబద్ధీకరిం చాలని, కనీస వేతనాలు 24వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి బ్రాంచ్ ఏఐటీయూసీ యూనియన్ నేతలు కార్మికులు గంజి శీను, నరసింహ, దర్గా స్వామి, కుమార్, ఆంజనేయులు, శ్రీకాంత్, శివ, మహేందర్, ప్రవీణ్, బాను, అనిల్, రవి కిషోర్, రహేళమ్మ, భాగ్యమ్మ, చెన్నమ్మ, ప్రమిల తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి వార్డుల్లో సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపిక సభలు

**కల్వకుర్తి, జనవరి 20 ప్రభాతవార్త:** మున్సిపాలిటి పరిధిలో ఉన్న అన్ని వార్డుల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం సభలు నిర్వహించినట్లు సోమ వారం మున్సిపల్ కమిషనర్ మహ్మద్ షేక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త రేషన్ కార్డుల దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ, ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలన కార్యక్రమాన్ని మున్సిపాలిటి పరిధిలో ఉన్న అన్ని వార్డుల్లో నేటి నుండి 24 వరకు ప్రతి వార్డులో వార్డు సభ నిర్వహిస్తున్నామన్నారు. ప్రస్తుతం ఉన్న రేషన్ కార్డులు యధావిధిగా కొనసాగుతాయి అని, ప్రజా పాలన, కుల గణన సర్వే ఆధారంగా రూపొం దించిన జాబితాను పరిశీలించి, నిర్ణీత ధ్రువీకరణ తర్వాత అర్హులైన సభ్యులందరికీ కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయబడతాయి అన్నారు. గతంలో మీ సేవలో దరఖాస్తు చేసుకున్న దరఖా స్తులను కూడా అర్హత ప్రమాణాల ఆధారంగా పరిశీలించడం జరుగుతుంది అని తెలిపారు. ప్రజా వాణిలో అందించినదరఖాస్తులను కూడా అర్హత ప్రమాణాల ప్రకారం పరిశీలించడం జరుగుతుందని, ప్రతి వార్డులో ఏర్పాటుచేసిన వార్డు సభ నందు కొత్త రేషన్ కార్డు కోసం, రేషన్ కార్డులో కుటుంబ సభ్యుల పేర్లు నమోదుచేయడం కోసందరఖాస్తులు సమర్పించవచ్చు. ఇట్టి దరఖాస్తులను పరిశీలిం చబడతాయన్నారు. ఇందిరమ్మ ఇండ్ల కొరకుచేసుకున్నదరఖాస్తులను పరిశీలించడం జరుగు తుందని, ఇందిరమ్మ ఇండ్లకు దరఖాస్తు చేసుకోని వారు కొత్తగా దరఖాస్తు చేసుకోవచ్చునని, ఇట్టి వాటిని పరిశీ లించడం జరుగుతుందని కమిషనర్ మహ్మద్ షేక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## ఆర్టీసీ బస్సు కింద పడి మహిళ మృతి

**నారాయణపేట టౌన్, జనవరి 20 ప్రభాతవార్త:** ప్రమాదవశత్తు ఆర్టీసీ బస్సు కిందపడి మహిళ మృతి చెందిన సంఘటన సింగారం గేట్ వద్ద చోటుచేసుకుంది. అందుకు సంబంధించి గ్రామస్తుల కథనం మేరకు వివరాలుఇలా ఉన్నాయి. దామరగిద్ద మండలంవత్తుగుండ్ల గ్రామానికి చెందిన కారం పొడి మణెమ్మ (35) సోమవారం తన చెల్లెలు కుమార్తెను నారాయణపేట మండలం సింగారం గేట్ సమీపంలో ఉన్న హాస్టల్‌లోవదిలిపెట్టడానికి వెళ్ళింది. చెల్లెలు కుమార్తెను హాస్టల్లో వదిలిపెట్టి సింగా రం చౌరస్తాకువస్తుండగా ప్రమదవశాత్తు ఆర్టీసీబస్సు కిందపడిఅక్కడిక్కడే మృతి మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహిం చి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తంనారాయణపేట జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

## మంద జగన్నాథానికి నివాళి

**మహబూబ్‌నగర్, జనవరి20 ప్రభాతవార్త:** మాజీ మంత్రి మంద జగన్నాథం ఇటీవలే అనారోగ్యంతో మరణించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో సోమవారం హైదరాబాద్ సాగర్ రోడ్డులోని కెకె గార్డెన్స్‌లో మాజీ ఎంపీ మంద జగన్నాథం దశదినకర్మకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నేతలు హాజరై నివాళులు అర్పించారు. మాజీ మంత్రులు లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వరరెడ్డి, గువ్వల బాలరాజు, మంద జగన్నాథం కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అనంతరం మంద చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

## ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి

**నవాబుపేట, జనవరి20 ప్రభాతవార్త:** ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మండల పరిధిలోని కూచూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి తెలియజేశారు. ఇందిరమ్మఇళ్ల కోసం లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలని నేడు గ్రామం లో ఏర్పాటు చేసిన గ్రామసభలో అప్లికేషన్లు పెట్టుకోవాలని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము ఆదేశాల మేరకు ఇందిరమ్మ ఇండ్లు , ఆహార భద్రతా కార్డుల స్వీకరణ అభ్యంతరము కొరకు నేడు కూచూర్ గ్రామపంచాయతీ వద్ద నిర్వహించనున్న గ్రామసభలో రేషన్ కార్డు లేని వాళ్ళు ఇందిరమ్మ ఇండ్ల గురించి అప్లికేషన్ పెట్టుకునే వాళ్ళు దరఖాస్తు చేసుకుంటే ఉదయం 10 గంటల నుంచి దర ఖాస్తుల స్వీకరణ ఉంటుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

## నేటి నుంచి గ్రామసభలు

**భూత్పూర్, జనవరి 20, ప్రభాతవార్త:** ప్రజాపాలనలో భాగంగా ఆరు గ్యారంటీల అమలుకుగాను ప్రజల నుంచి తీసుకున్న అభ్యర్థనల మేర లబ్ధిదారుల ఎంపిక కోసం ఈ నెల 21న గ్రామసభలు నిర్వహించనున్నారు. జనవరి 21 నుంచి 24వరకు నాలుగు రోజుల పాటు భూత్పూర్ మండలంలో గ్రామసభలు నిర్వహించేందుకు అధికారులు పటిష్టమైన చర్యలు చేపట్టారు. జనవరి 21న శేరుపలి (హెచ్), భట్టుపల్లి, పోతులమడుగు రావులపల్లి, పెద్దతండా, కరివెనలలో ఉదయం తొమ్మిది గంటలకు గ్రామసభలు నిర్వహిస్తారు. 22న కప్పెటలో, 23న తాటికొండ, వెల్కిచర్ల, చౌల తండా, కొత్తమొల్గర, తాటిపర్తి, లంబడికుంట తండాలలో 24న హస్నాపూర్, మద్దిగట్ల, అన్నాసాగర్, కొత్తూరు, పాతమొల్గ రలలో ఆయా గ్రామ పంచాయతీలలో గ్రామసభలు నిర్వహిస్తారు. శేరుపల్లి(హెచ్), తాటికొండ, హస్నాపూర్‌లలో జరిగే గ్రామసభలకు మండల స్పెషల్ ఆఫీసర్ కె వేణుగోపాల్ ప్రాతినిత్యం వహి స్తారు. భట్టుపల్లి, మద్దిగట్ల, వెల్కిచర్లలో జరిగే గ్రామసభలకు తహశిల్దార్ ఎంఎ రహమాన్ ప్రాతి నిత్యం వహిస్తారు. పోతులమడుగు, చౌలతండా, అన్నాసాగర్‌లలో జరిగే గ్రామసభలకు ఎంపీడీఓ కె ప్రభాకర్‌చారి ప్రాతినిత్యం వహిస్తారు. రావులపల్లి, కప్పెట, కొత్తమొల్గరలలో జరిగే గ్రామసభలకు ఎంపీఓ శ్రీదేవి ప్రాతినిత్యం వహిస్తుండగా, పెద్దతండా, తాటిపర్తి, కొత్తూర్‌లలో మండల వ్యవసాయా ధికారి జి మురళీధర్ ప్రాతినిత్యం వహిస్తారు. కరివెన, లంబడికుంట తండా, పాతమొల్గరలలో నిర్వ హించే గ్రామసభలకు పంచాయతీరాజ్ ఎఈ సీఎన్ స్వామి ప్రాతినిత్యం వహిస్తారని మండల పరి షత్ అధికారి కె ప్రభాకర్‌చారి తెలిపారు.

## ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి

**వెల్దండ, జనవరి 20 ప్రభాతవార్త:** వైద్యులు ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కేంద్ర ఆరోగ్య బృందం తమిళనాడుకు చెందిన డాక్టర్ కవిత, డాక్టర్ శక్తి మాళవిక అన్నారు. మండల పరిధి లోని కొట్ర ఆరోగ్య సబ్‌సెంటర్‌ను కేంద్ర బృందం ఆధ్వర్యంలో డాక్టర్ కవిత, డాక్టర్ శక్తి మాళవిక తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు సబ్ సెంటర్‌ను పరిశీలించి రోగులకు అందించే వసతులపై ఆరా తీశారు. ప్రజలకు అందిస్తున్న వైద్యం గురించి తెలుసుకున్నారు. వైద్య సిబ్బంది మానవత దృక్పథంతో అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ మంజు భార్గవి, పల్లె వైద్యులు నవీన్ కుమార్‌తో పాటు, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

# నేటి నుంచి సంక్షేమ పథకాలపై గ్రామసభలు

- ఆర్డీవో శ్రీను నాయక్

**కల్వకుర్తి, జనవరి 20 ప్రభాతవార్త:** కల్వకుర్తి మండలంలోని అన్ని గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్ల, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలపై గ్రామ సభలపై తగు సూచనల కొరకు ఆర్డీఓ, ఎంపీడీఓ, తహశీల్దార్, వ్యవసాయ అధికారులు కలసి పంచాయతీ కార్య దర్శులకు, ఏఈఓ లకు సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో శ్రీనునాయక్ మాట్లాడుతూ ఇట్టి విషయా లపై ప్రజలు అందరికి ముందస్తుగానే సమాచారము ఇవ్వాలని తెలిపారు. ఇట్టి పథకాలలో నమోదు కానీ వారు ఉంటే గ్రామ సభలలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆదే విధంగా గ్రామ సభల్లో తీసుకోవాలనే అంశాలపై సూచనలు సలహాలు ఇచ్చారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనునాయక్

అదే విధంగా ప్రత్యేకఅధికారులుగా పర్యవేక్షణ కోసం తహశీల్దార్ ఇబ్రహీం, ఎంపిడిఓ వెంకటరాములు, ఎంఎఓ సురేష్, ఎంపిఓ సునితలను ప్రతి 6 గ్రామ పంచాయతీ గ్రామ సభల పర్యవేక్షణలో కోసంఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ గ్రామస్తులను విజయవంతం చేయాలనిసూచించారు. ఈ సమావేశంలోపంచాయతీ కార్యదర్శులు, వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గర్భం కారణంగా ఏ తల్లి మరణించకూడదు

◆ మాతృ మరణాలను నివారించాలి ◆ జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ కె.వి స్వరాజ్యలక్ష్మి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 20 ప్రభాతవార్త:** నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌లోని డిఎమ్‌హెచ్ఓ ఛాంబర్‌లో జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ కె.వి స్వరాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి మాతృ మరణాల సమీక్ష కమిటీ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఇటీవల తాడూర్, పదర, మరియు బొప్పల్లి ప్రాథ మిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో గల గ్రామాలలో జరిగిన 3 మాతృ మరణాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ కె.వి స్వరాజ్యలక్ష్మి మాట్లాడుతూ జరిగిన 3 మాతృ మరణాలకు కారణాలను తెలుసుకొని, అవి మళ్లీ పునరావృతం కాకుండా తగిన చర్యలు చేపట్టడమే ఈ సమీక్ష సమా వేశం ముఖ్యఉద్దేశమని తెలిపారు. సంబంధిత ఏన్ఏంల రికార్డులను మరియు రిపోర్ట్‌లను పరిశీలించారు. గర్భవతులు నమోదు చేసు కున్న వెంటనే ఏఎన్ఎంలు గర్భవతులకు ముఖ్యంగా రక్తపోటు, రక్తంలో హిమోగ్లోబిన్ మరియు గ్లూకోజు స్థాయి పరీక్షలు నిర్వహిం చాలి మరియు సకాలంలో వైద్యాధికారిచే మరియు గైనకాలజిస్ట్‌చే పరీక్షలు చేయించాలన్నారు. గర్భవతిలో ఏమైనా ప్రమాదకర



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ కె.వి స్వరాజ్యలక్ష్మి

లక్షణాలు కనిపిస్తే పర్యవేక్షణ సిబ్బంది వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి గర్భవతులు సుఖప్రసవం అయ్యేంతవరకు ప్రత్యేక హోదా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్స్ సర్వీసెస్ డాక్టర్‌రామకృష్ణ, అచ్చంపేట ప్రభుత్వ ఆసు పత్రి సూపరిడెంట్ డాక్టర్ ప్రభు, డిప్యూటీ డిఎంహెచ్ఓ. డాక్టర్ వెంకట దాస్, డాక్టర్ తారాసింగ్, ప్రోగ్రాం అధికారి డాక్టర్ లక్ష్మణ్, వైద్యాధికారులు పిహెచ్ఎన్ మంగమ్మ, నిరంజన్ సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పర్యవేక్షణ సిబ్బంది, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# మాది చేతల ప్రభుత్వం.. మాటల ప్రభుత్వం కాదు

■ దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి

**కొత్తకోట జనవరి 20 ప్రభాతవార్త:** మాది చేతల ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి అన్నారు. సోమవారం కొత్తకోట మండల ప్రజా పరిషత్ కార్యాల యంలో మండలానికి మంజురైనా 43 కల్యాణ లక్ష్మి, షాదీ ముబా రక్ చెక్కుల పంపిణి కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యతితులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నేటి నుండి గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డుల ప్రక్రియ ప్రారం భం అవుతుందని అందుకు గ్రామంలో ఉండే ప్రతి కాంగ్రెస్ కార్య కర్త గ్రామసభలకు హాజరైప్రజల సమస్యలు తెలుసుకొని అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు అందజేస్తామని, రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇళ్ల పథకం నిరంతర ప్రక్రియ అన్నారు, ఇందులో ఎవరూ ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. నేటి నుంచి 24 వరకు నిర్వహించే గ్రామసభలలో ఇందిరమ్మ ఇండ్లకు, రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేసిన, ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దుకుంటూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరు స్తుం దని తెలిపారు. అందులో భాగంగా ఈనెల 26 రిపబ్లిక్ డే నుండి 12000 రూపాయలు రైతు భరోసా వేస్తామని తెలిపారు. అదే విధం గా భూమిలేని పేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద 12 వేల రూపాయలను అందజేస్తామని తెలిపారు. ప్రభుత్వం ఒక్కో



కొత్తకోటలో కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

కార్యక్రమం తీసుకోని ప్రజలకు అందజేస్తుందని తెలిపారు. అనం తరం చెక్కులను పంపిణి చేశారు. అనంతరం కాంగ్రెస్ సోషల్ మీడియా కన్వీనర్ నవీన్ కుమార్ తల్లి దశదిన కర్మకు హాజరై కుటుంబాన్ని పరామర్శించారు. అదేవిధంగా విలియం కొండ గ్రామం లో నూతన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ చెన్నమ్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లెపాగు ప్రశాంత్, సీడీసీ చైర్మన్ గొల్లబాబు, కాంగ్రెస్ మండల అధ్యక్షులు బీచ్పల్లి యాదవ్, పట్టణ అధ్యక్షులు మేస్త్రి శ్రీను, జిల్లా కార్యదర్శులు కృష్ణారెడ్డి, బోయెజ్, కో ఆప్షన్ సభ్యులు మిషేక్, కిసాన్ రైతు సంఘం అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ బాబు, ఎల్లంపల్లి నరేందర్ రెడ్డి, చర్లపల్లి శేఖర్ రెడ్డి, సుభాష్, గోకరయ్య, బాలరాజు యాదవ్, శివ యాదవ్, అమ్మపల్లి బాలకృష్ణ, క్రాంతి, ముస్తఫా, పెంటయ్య యాదవ్, మన్యం తదితరులు పాల్గొన్నారు.

# గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

-నాగర్‌కర్నూల్ జిల్లా అదనపు కలెక్టర్లు పి అమరేందర్, దేవ సహాయం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 20 ప్రభాతవార్త:** ఈనెల 26న జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని అందుకు అవసరమైన ఏర్పాట్లను ఆయాశాఖల అధికారులు సమన్వ యంతో పూర్తిచేయాలని అదనపు కలెక్టర్లు పి అమరేందర్, దేవ సహాయంలు అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణపై సంబంధిత శాఖఅధికారులతో అదనపు కలెక్టర్లు ముందస్తుగా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు పి అమరేందర్, దేవ సహాయంలు మాట్లాడుతూ జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించుకునే జనవరి 26రిపబ్లిక్ డేఅత్యంత వైభవం గా నిర్వహించాలని ప్రభుత్వ ఆదేశాలు మేరకు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా పథకా లను లబ్ధిదారులకు అందించే విషయంపై సిద్ధంగా ఉండాలన్నారు. సమగ్ర సమాచారంతో రిపబ్లిక్ డే ఇన్విటేషన్ కార్డ్స్ తయారు చేయాలని కలెక్టరేట్ ఏవోను ఆదేశించారు. శాఖల వారీగా చాపట్ట బోయే కార్యక్రమాలపై కార్యాచరణ ముమ్మరం చేయాలన్నారు త్రాగునీరు, శానిటేషన్, మున్సిపల్‌కమిషనర్ చర్యలు చేపట్టాల న్నారు ముఖ్య ప్రణాళికాధికారి, జిల్లా పౌర సంబంధాల అధికారి సమన్వయంతో ప్రభుత్వం ఆరు గ్యారెంటీ పథకాల పై ప్రాధాన్య తనిస్తూ నూతన పథకాలు ఆమలను పరిగణలోకి తీసుకోవడంతో పాటు శాఖల వారి సమగ్ర సమాచారంతో సిద్ధంగా ఉండాలని,



మాట్లాడుతున్న నాగర్ కర్నూల్ జిల్లా అదనపు కలెక్టర్లు, పి అమరేందర్, దేవ సహాయం

వైద్య ఆరోగ్యశాఖ ద్వారా 108 అంబులెన్స్ సిద్ధం చేసుకోవడంతో పాటు హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేయాలన్నారు, ప్రభుత్వ శాఖల, శకటాలు ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. జిల్లా విద్యా శాఖ ద్వారాసాంస్కృతిక కార్యక్రమాలు రూపొందించాలన్నారు, ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాల అందించే విషయంలో ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవే యడంలో ఆర్థిక అభివృద్ధి, సామాజిక అభివృద్ధి, సుపరిపాలన, విధుల యందు చిత్తశుద్ధి సంబంధిత అంశాలలో ప్రథమస్థానంలో ఉన్నఉద్యోగులను మాత్రమే ఎంపిక చేయాల న్నారు. అగ్నిమాపక శాఖ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన పెంపొందించే కార్యక్రమాలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో చంద్ర శేఖర్, సంబంధిత శాఖల జిల్లా అధికారులు, ఆయాశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కంది కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

**గద్వాల జనవరి 20 ప్రభాతవార్త:** జిల్లా వ్యాప్తంగా రైతులు పండించిన కంది పంటను కొనుగోలు చేసేందుకు వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మినారా యణ సంబంధిత అధికారులకు ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని తన చాంబర్లో కందుల కొనుగోలుపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 2024-25 వానకాలం సీజన్లో రైతులు పండించిన కందులను మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని సూచించారు. జిల్లాలోని ఆలంపూర్, వడ్డేపల్లి, ఐజ, పుటాన్ దొడ్డి, గద్వాల మార్కెట్లలో కందుల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. జిల్లాలో ముందుగా బుధవారం రోజున అలంపూర్, వడ్డేపల్లి మార్కెట్లలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కందులను కొనుగోలు చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాలకు 7,550/- చొప్పున కొనుగోలు చేయాలని సూచిం చారు. రైతులు నాణ్యమైన కందులను కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియ నాయక్, మార్క్ ఫెడ్ డిఎం గౌరీ నగేష్, జిల్లా కోఆపరేటివ్ అధికారి శ్రీనివాస్, ఎస్ డబ్ల్యూ సి మేనేజర్ ఉపేందర్ వివిధ శాఖల సహాయ అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్ష చేస్తున్న అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణ

## ప్రజా సమస్యలపై పోరాటాలు ఉధృతం : సిపిఎం నేతలు

**ఆత్మకూరు జనవరి 20 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం గత ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన వాగ్దానాల అమలు కోసం ప్రజా సమస్యల పరిష్కారానికై సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలను ఉధృతం చేయనున్నట్లుగా సిపిఎం వనపర్తి జిల్లా కార్యవర్గ సభ్యులు మహమూద్ ఎస్.రాజు తదితరులు వెల్లడించారు. ఈ మేరకు సోమవారం రోజు మండల కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ అతిథి గృహా వరణంలో ఈ నెల 25 నుండి జరగనున్న సిపిఎం రాష్ట్ర మహాసభల గోడపత్రికను వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమవుతున్నారని వారు తీవ్రస్థాయిలో ఆరోపించారు. పేదలకు ఇంటి స్థలంతో పాటుగా ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం ఐదు లక్షల రూపాయలు కేటాయిస్తామని ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు కావస్తున్నప్పటికీ కాలయాపన చేయడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. గత ఎన్నికల సమయంలో రైతు భరోసా పేరిట ఎకరాకు ఏడాదికి 15వేల రూపాయలు చెల్లిస్తామని ప్రస్తుతం 12 వేల రూపాయలకు కుదించడం సరైన విధానం కాదని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు భారతీయుడు మునెప్ప తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

**కల్వకుర్తి, జనవరి20 ప్రభాతవార్త:** వాసవి క్లబ్ కేసీజీఎఫ్ కల్వకుర్తి ఆధ్వర్యంలో సేవాకార్యక్రమంలో భాగంగా సోమ వారం జడ్పీహెచ్ఎస్ మార్చాల గ్రామంలో పూర్వాధ్యక్షులు చిదిరే శ్రీనివాసులు 10వ తరగతి చదువుతున్న 8 మంది విద్యా ర్థులకు ప్రోత్సాహక బహుమతిగా ప్రతి ఒక్క విద్యార్థికి రూ.వెయ్యి రూపాయలుఅందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాసవిక్లబ్ ఉన్నత విద్య కోసం, ఉన్నత చదువుల కోసం సహాయం అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు బాదం రాఘవేందర్, జోన్ చైర్మన్ శ్రీనివాసులు, డిస్ట్రిక్ట్ ఆఫీసర్ గుగ్గిళ్ళ శంకర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సి.హెచ్. వెంకటరమణ, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

**వనపర్తి క్రైమ్ జనవరి 20 ప్రభాతవార్త:** మహిళలపై ఎలాంటి లైంగిక వేధింపులకు సంబంధించిన చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి రజిని అన్నారు. సోమవారం బాలుర జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లా డారు. లైంగిక వేధింపుల చట్టం 2013 పై క్లుప్తంగా వివరిం చారు. పదిమంది మహిళల కన్నాఎక్కువగా పని చేయు ప్రభుత్వ ప్రైవేటు ఏ ఇతర సంస్థల్లోనూ కానీ ఖచ్చితంగా నలు గురితో కూడిన ఇంటర్నల్ కంప్లైంట్స్ కంపెనీ ఏర్పాటు చేసి సమస్యలు సీనియర్ మహిళలు ఉద్యోగిని ప్రొసీడింగ్ ఆఫీసర్‌గా నియ మించి కచ్చితంగా నలుగురిలో ఇద్దరు మహిళలు ఉండాలని సూచించారు. మహిళలుఏవిధంగా రక్షణ కల్పిస్తుంది శిక్ష అర్హులు ఏవిధమైన అటువంటి శిక్షలు అమలుపరుస్తారో అన్నవాటిపై వివరించారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానో పాధ్యాయుడు గురురాజు యాదవ్, ఉపాధ్యాయులు పలువురు పాల్గొన్నారు.

## జిల్లా ఆర్యవైశ్య మహాసభ అదనపు కార్యదర్శిగా బాదం వెంకటేష్

**కొత్తకోట జనవరి20 ప్రభాతవార్త:** ఆర్యవైశ్య మహాసభ నూతన అదనపు కార్యదర్శిగా కొత్తకోటకు చెందిన బాదం వెంకటేష్ ను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అయన మాట్లా డుతూ వనపర్తి జిల్లా కేంద్రంలోని కన్యకాపరమేశ్వరి మాత ఆల యంలో జిల్లాకు చెందిన ఆర్య వైశ్యులు సమావేశమై జిల్లా ఆర్యవైశ్య మహాసభ అదనపు కార్యదర్శిగా నన్ను ఎకగ్రీవంగా ఎంపిక చేసిన ఆర్యవైశ్య మిత్రులకు ధన్యవాదాలు తెలిపారు. రాబోయేరెండేళ్లలో జిల్లా ఆర్యవైశ్య సంఘాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి నా పై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా అంకిత భావంతో పనిచేసి సేవలు అందిస్తానని తెలిపారు.

## విరసం సభలను విజయవంతం చేయండి

**గద్వాల జనవరి20 ప్రభాతవార్త:** ఫిబ్రవరి 8,9 తేదీల్లో కర్నూల్‌లో జరుగబోయే విరసం రాష్ట్ర స్థాయి సభలూ సాహి త్య, పాఠశాలను విజయవంతం చేయాలని ప్రజా సంఘాల ప్రతినిధులు పిలుపునిచ్చారు. సోమవారం విరసం కరపత్రంను విడుదల చేశారు. కరపత్రం విడుదలలో వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నవారు. కర్నూల్ కు చెందిన రచయిత సారంగపాణి, టీపీఎఫ్ కన్వీనర్ శంకర ప్రభాకర్, బీఆర్ఎస్ నాయకుడు నాగార్‌దొడ్డి వెంకట్‌రాములు, పెన్షనర్స్ యూని యన్ అధ్యక్షులు అబ్దుల్‌బాబు, బహుజనరాజ్య సమితి నాయ కులు వినోద్, పౌర హక్కుల సంగంనాయకులు సుభాన్, బీఆర్ ఎస్ విద్యార్థి నాయకుడుపల్లయ్య, పిఏవి అధ్యక్షులు ఇక్బాల్ పాషా, సీపీఐనాయకులు రంగన్న, ఆశన్న, హన్మంతు, బీఆర్ఎస్ రేవతి రైతు సంక్షేమ సంఘం అధ్యక్షులు కృష్ణయ్యా, డి. హన్మంతు, అతిఖుర్ రహేమాన్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతా మాసోత్సవాలలో పాల్గొన్న ఎమ్మెల్యే, ఎస్పీ

**కల్వకుర్తి, జనవరి 20 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలో సోమ వారం రోడ్డు భద్రతా వారోత్సవాలలో భాగంగా చేపట్టిన కార్య క్రమాలలో ఎమ్మెల్యేకసిరెడ్డి నారాయణరెడ్డి, జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. పట్టణం లో మహబూబ్‌నగర్ చౌరస్తా నుండి హైదరాబాద్ చౌరస్తా వరకు 200 మందితో ర్యాలి నిర్వహించారు. అనంతరం రోడ్డు భద్రతావారోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరిం చారు. తదుపరి రోడ్లపై జాగ్రత్తగా వ్యవహరించాలని, నిబంధ నలు పాటించాలని కోరారు. ప్రతిఒక్కరు నిబంధనలు పాటిస్తూ జాగ్రత్తగా డ్రైవ్ చేస్తే ప్రమాదాలు నివారించవచ్చు అని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ వెంకటేశ్వర్లు, సిఐలు నాగార్జున, విష్ణువర్ధన్ రెడ్డి, ఎస్సైలు, మండలముఖ్య నాయకులు, యువకులు పాల్గొన్నారు.

## ఆత్మకూరును అభివృద్ధి పథంలో కొనసాగిస్తాం

**ఆత్మకూరు జనవరి 20 ప్రభాతవార్త:** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణాన్ని అభివృద్ధి పథంలో పరుగులు పెట్టించే ందుకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మక్తల్ నియోజకవర్గం శాసనసభ్యులు వాకిటి శ్రీహరి అండదండలతో అహర్నిశలు కృషి చేస్తామని మొత్తం నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు తులసిరాజు యాదవ్, ఆత్మకూరు మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పరమేష్, తదితరులు వెల్లడించారు. ఈ మేరకు సోమవారం రోజు ఆత్మకూరులోని ప్రభుత్వ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆత్మకూర్ చిరకాల కోరిక అయినటువంటి డయాలసిస్ కేంద్రాన్ని మంజూరీ చేయించడం ఎమ్మెల్యే ఘనతగా వారు పేర్కొన్నారు. ఆత్మకూరు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన డయాలసిస్ బాధితులు గతంలో వనపర్తి, హైదరాబాద్, కర్నూల్ పట్టణాలకువెళ్లి డయాలసిస్ కొనసా గించుకునే వారిని ప్రస్తుతం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకి విజ్ఞప్తి చేయడంతోయుద్ధ ప్రాతిపదికన డయాల సిస్ కేంద్రం మంజూరు చేయడం అందులో భాగంగానే ఈనెల 21 నుండి డయాలసిస్ ఏర్పాట్లు ప్రారంభించినట్లుగా వారు వెల్లడించారు. విలేకరుల సమావేశంలో ఆత్మకూరు పట్టణ అధ్య క్షులునల్లగొండ శ్రీనివాసులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రహమతుల్లా తదితరులతోపాటుగా పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నిజాలను నిక్కచ్చిగా రాసే పత్రిక వార్త పత్రిక

◆ దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి

**కొత్తకోట జనవరి 20 ప్రభాతవార్త:** నిజాలను నిక్కచ్చిగా వెలుగులోకి తెచ్చేదే వార్త పత్రిక అని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం కొత్తకోట ప్రజాపరిషత్ కార్యాలయంలో ప్రభాతవార్త క్యాలెండర్ ను దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రజలోకి తీసుకెళ్లే విదంగా వార్తలు రాయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీ ల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ చెన్నమ్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లెపాగు ప్రశాంత్, సీడీసీ చైర్మన్ గొల్లబాబు, కాంగ్రెస్ మండల అధ్యక్షులు బీచ్పల్లి యాదవ్, పట్టణ అధ్యక్షులు మేస్త్రి శ్రీను, జిల్లా కార్యదర్శులు కృష్ణారెడ్డి, బోయెజ్, కో ఆప్షన్ సభ్యులు మిషేక్, కిసాన్ రైతు సంఘం అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ బాబు, ఎల్లంపల్లి నరేందర్ రెడ్డి, చర్లపల్లి శేఖర్ రెడ్డి, సుభాష్, గోకరయ్య, బాలరాజు యాదవ్, శివ యాదవ్, అమ్మపల్లి బాలకృష్ణ, క్రాంతి, ముస్తఫా, పెంటయ్య యాదవ్, మన్యం తదితరులు పాల్గొన్నారు.